# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 10 సంచిక : 33 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | బుధవారం 7 అక్టోబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :33 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | WED 7 OCTOBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు..

## రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు



- నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- గత నెలలో రూ.1,345 కోట్ల పనులు జరిగాయని అధికారులు వెల్లడి
- ఔటర్ రింగ్ రోడ్డుపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం
- ప్రస్తుతం 41 వేల మంది కార్మికులతో కొనసాగుతున్న పనులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా

ఆరా తీశారు.రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.



## టీడీపీ అంతర్గత వివాదాలపై పల్లా శ్రీనివాసరావు దృష్టి..

### నేతలకు కీలక సూచనలు

- తిరువూరు టీడీపీ వివాదంపై రంగంలోకి దిగిన పల్లా శ్రీనివాసరావు
- ఎమ్మెల్యే కొలికపూడి, బాలకోటయ్యలకు కీలక సూచనలు
- దెందులూరు టోల్‌ప్లాజా ఘటనపైనా విచారణ
- చింతమనేని నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న శ్రీనివాసరావు
- క్రమశిక్షణ పాటించాలని నేతలకు స్పష్టం

పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాల పరిష్కారంపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించారు. తిరువూరు నియోజకవర్గంతో పాటు దెందులూరు ఎమ్మెల్యేకు సంబంధించిన వివాదాలపై ఆయన లోతుగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సంబంధిత నేతలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి, వారి నుంచి వివరణ కోరారు.ముందుగా,

- మిగతా 2లో

## స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ కోటా.. సుప్రీంకోర్టులో గెలుస్తాం

- ఢిల్లీలో న్యాయ నిపుణులతో చర్చలు జరిపిన టీడీపీ నేతలు
- బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని రామ్మోహన్ నాయుడు ప్రశ్న
- బీసీలకు రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని మండిపాటు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల కు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు సుప్రీం కోర్టులోనూ పూర్తి అవకాశం ఉందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ లక్ష్యంతోనే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును

- మిగతా 2లో

## 100 కోట్ల ప్రయాణాలతో 'స్త్రీ శక్తి' చారిత్రాత్మక ఘనత.. చంద్రబాబు హర్షం

- స్త్రీశక్తి పథకం కింద 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు పూర్తి
- రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం
- ఈ పథకం ద్వారా మహిళలకు రూ.3,550 కోట్ల ఆదా జరిగిందన్న సీఎం
- మహిళలతో పాటు ఆర్టీసీ సిబ్బందికి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు

ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్త్రీశక్తి' పథకం చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేసుకున్నారు. ఈ ఘనత పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆదరణ, మాతృమూర్తుల ఆమోదంతోనే ఈ విజయం

- మిగతా 2లో





## వాయు సేన కొత్త అధిపతిగా.. ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్

పెన్ పవర్ డెస్క్:భారత వాయుసేన 29వ నూతన అధిపతిగా ఎయిర్ మా ర్షల్ ఆశుతోష్ దీక్షిత్ నియమితుల య్యారు. ప్రస్తుతం వాయుసేన వైస్ చీఫ్‌గా సేవలందిస్తున్న ఆయన, అక్టోబర్ 31 నుంచి

వివరాలు 2లో..





## 5 అసెంబ్లీ,1 లోక్‌సభకు బైపోల్స్..

### అక్టోబర్ 9న ఎన్నికల ఫలితాలు

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం ,కేంద్రపా లిత ప్రాం తం పుదుచ్చేరిలో ఐదు అసెంబ్లీ స్థానాల కు, ఒక లోక్‌సభ నియోజకవర్గానికి మంగళవారం ఉప ఎన్నికలు జరిగాయి. పోలింగ్ జరిగిన నియోజకవర్గాలలో తమిళనాడులోని

వివరాలు 2లో..



## ఒక్క మిల్లీమీటర్ మా భూభాగంలోకి వచ్చినా తీవ్ర పరిణామాలు తప్పవు

### దక్షిణ కొరియాకు ఉత్తర కొరియా హెచ్చరిక

వివరాలు 2లో..

## ఢిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద ఉద్రిక్తత

### పోలీసుల అదుపులో రాహుల్ గాంధీ, ప్రియాంక..

- సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల భారీ నిరసన
- పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయానికి ఇండియా కూటమి ర్యాలీ
- బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన రాహుల్ గాంధీ
- రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ సహా పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆకాశవాణి భవన్‌లో బైఠాయించి కొనసాగుతున్న ఆందోళన



పెన్ పవర్ డెస్క్:దేశ రాజధాని ఢిల్లీ మంగళవారం విపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు, హైడ్రామాకు దారితీసింది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను

- మిగతా 2లో





## చిన్న పరిశ్రమలకు రూ.10వేల కోట్లు పెట్టుబడులు..

### రవాణా రంగానికి మాస్టర్ ప్లాన్: కేంద్ర కేబినెట్

**ప్రధాని మోడీ అధ్యక్షతన భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా 2 కీలక చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి రూ.10వేల కోట్ల కేటాయింపుతో పాటు.. రవాణా అండ్ లాజిస్టిక్స్ రంగాన్ని సమన్వయం చేయడానికి 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ అథారిటీ' ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.**

పెన్ పవర్ డెస్క్: దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో వృద్ధి దశలో ఉన్న కంపెనీలకు ఈ 'ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్' ద్వారా ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడులు అందనున్నాయి. ఇప్పటివరకు మార్కెట్లో ఉన్న మెజారిటీ ఫండ్స్ అన్నీ కేవలం ప్రారంభ దశలో ఉన్న మైక్రో పరిశ్రమలకే పరిమితం కావడం వల్ల గ్రోత్-స్టేజ్ క్యాపిటల్ కొరత తీవ్రంగా ఉంది. ఈ లోపాన్ని సరిదిద్దేందుకే ప్రభుత్వం రూ. 10వేల కోట్లతో ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తోందని కేంద్రం వెల్లడించింది.

- మిగతా 2లో

## పాక్ గూఢచర్య నెట్‌వర్క్‌ను ఛేదించిన ఏపీ ఇంటెలిజెన్స్.. ఇద్దరి అరెస్ట్

- ఆపరేషన్ ఫైర్‌వాల్-2026తో పాక్ గూఢచర్య ముఠా గుట్టురట్టు
- విశాఖ నేవీ స్థావరాల సమాచారమే లక్ష్యంగా కుట్ర
- 13 మంది నేవీ సిబ్బంది సహా 18 మందిపై నిఘా
- విశాఖ, కోయంబత్తూర్‌లలో ఇద్దరిని అరెస్ట్ చేసిన అధికారులు
- డబ్బు కోసం రహస్య సమాచారం చేరవేసినట్లు ఆరోపణలు

- మిగతా 2లో





## హార్ముజ్ లో వాణిజ్య నౌకపై క్షిపణి దాడి..

### 11 మంది భారతీయ నావికులకు గాయాలు

పెన్ పవర్ డెస్క్:హార్ముజ్ జలసంధి సమీపంలోని ఒమన్ తీరంలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న ఎంటీ ఆన్ పీస్ వాణిజ్య నౌకపై క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో నౌకలో ఉన్న

- మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్ల భయంతోనే వైసీపీ కోర్టులకు వెళుతోంది

- బీసీల సంక్షేమంపై వైసీపీకి చిత్తశుద్ధి లేదన్న మండిపల్లి
- 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామన్న మంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిదే విజయమని ధీమా



పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే భయంతోనే వైసీపీ కోర్టులను ఆశ్రయిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

- మిగతా 2లో

## జగన్ మోహన్ రెడ్డిని కలిసిన ప్రతిపాడు వైసిపి ఇన్ఛార్జ్ ముద్రగడ గిరిబాబు



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 06:** తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రతిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జ్ ముద్రగడ గిరిబాబు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై జగన్మోహన్ రెడ్డితో చర్చించినట్లు సమాచారం.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## మంత్రి సుభాష్ చొరవతో రామచంద్రపురం
# పట్టణ అభివృద్ధికి రూ.17 కోట్ల నిధులు

- హెచ్ ఏ ఎం నిధులతో పట్టణానికి మహర్దశ
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రామచంద్రపురం పెన్ పవర్ అక్టోబర్ 6:** రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ కింద రూ.17 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషి ఫలితంగానే పట్టణ అభివృద్ధికి భారీగా నిధులు సమకూరుతున్నాయని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తెలిపారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి రూ.17 కోట్ల హెచ్ ఏ ఎం నిధులు మంజూరు చేసిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, అవసరమైన నిధుల కోసం ప్రభుత్వ స్థాయిలో నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. మంత్రి సుభాష్ చొరవతో పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రూ.17 కోట్ల నిధులతో సెంట్రల్ డివైడర్లు, వీధి దీపాలు, సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధి తదితర మౌలిక వసతుల పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కె.ఎస్.ఆర్. నగర్ పార్క్, హౌసింగ్ బోర్డ్ కాలనీ పార్క్, లలిత్ నగర్ పార్క్, సాయి నగర్ పార్క్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సివిట్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో రూ.17 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషి ఫలితంగానే రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి రూ.17 కోట్ల నిధులు సాధించగలిగామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి తీసుకురావడంలో చొరవ చూపుతున్నారని కొనియాడారు. రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మంత్రి సుభాష్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పరంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూనే మంత్రి సుభాష్ వ్యక్తిగతంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని నాయకులు ప్రశంసించారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, పేదలకు సహాయం, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రామచంద్రపురం పట్టణాన్ని మరింత సుందరంగా, అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మంత్రి సుభాష్ నాయకత్వంలో అభివృద్ధి పనులు మరింత వేగం పుంజుకుంటాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు, డీఈ శ్రీకాంత్, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవిల్లి శివ, చందమామ వాసు, గొల్లపల్లి కృష్ణ, గరికపాటి సూర్యనారాయణ, కంచుమర్తి బాబురావు, కొత్తపల్లి శ్రీనుబాబు, దునే శ్రీనివాస్, నారపురెడ్డి బలరాం, సలాది నాయుడు, కట్టా నాగేశ్వరావు, పదం మూర్తి, రాఘవేంద్ర, జాస్తి విజయలక్ష్మి, వయిట్ల గజలక్ష్మి, బళ్ళ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే మంగళవారం
# నుంచి గ్రామాల్లో విస్తృత తనిఖీలు



### విధుల పట్ల నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు
### జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 06:** గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ తీరుపై వచ్చే మంగళవారం నుంచి క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, డ్వామా పథక సంచాలకులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే మంగళవారం నుంచి ప్రతి గ్రామంలో తాను స్వయంగా పర్యటించడంతో పాటు అధికారులు కనీసం రెండు గంటల పాటు క్షేత్రస్థాయిలో సమయం వెచ్చించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనలో లోపాలు, నిర్లక్ష్యం గుర్తిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జలధార--జలహారతి కింద ప్రతిపాదించిన అభివృద్ధి పనుల్లో వారానికి నిర్దేశించిన పురోగతిని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్, ఓహెచ్ ఎస్ ఆర్ ట్యాంకుల నిర్మాణం, సింగిల్ విలేజ్ స్కీములు, రిట్రోఫిట్టింగ్ పైప్‌లైన్లు, కుళాయిల ఏర్పాటు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను రాబోయే రెండు రోజుల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్, డి ఎం ఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని, ఏపీఎంల సమన్వయంతో మరింత మందిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు.

'స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు' కార్యక్రమం, సచివాలయాల పరిధిలో ప్రజలకు నూటికి నూరు శాతం సంతృప్తికరమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు రకాల సర్టిఫికెట్లను కేవలం 'మన మిత్ర' యాప్ ద్వారా మాత్రమే జారీ చేయాలని స్పష్టం చేశారు. ఎన్ పి సి ఐ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రత్యక్ష నగదు బదిలీ (డిబిటి) విధానంలో లబ్ధిదారులకు అందేలా చూడాలని తెలిపారు. పౌరుల పెండింగ్ ఈ-కెవైసీ ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు బయోమెట్రిక్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పోస్టల్ శాఖ, కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్ సీ) సమన్వయంతో జిల్లాలోని 31,000 మంది పిల్లలకు 102 ప్రత్యేక కిట్ల ద్వారా ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద ప్రతిపాదించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. లైబ్రరీ పన్నుల వసూలు ప్రక్రియను నిబంధనల ప్రకారం జిల్లా కేంద్రానికి బదిలీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మహమ్మద్ అబ్దుల్లా మదిన్, డ్వామా పథక సంచాలకులు ఎస్. మధుసూదన్, ఎస్ జి ఎస్ డబ్ల్యూ నోడల్ అధికారి జె. వేణుగోపాల్, జలవనరుల శాఖ ఈఈ శేషగిరిరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వీఆర్ఏల నిరసనకు మాజీ సర్పంచ్ గుణ్ణం సంఘీభావం



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 06** ఆలమూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ధర్నా చౌక్లో గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఎ) సంఘం చేపట్టిన నిరవధిక సహాయ నిరాకరణ ఉద్యమం మంగళవారానికి 215 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గుమ్మిలేరు తాజా మాజీ సర్పంచ్ గుణ్ణం రాంబాబు నిరసన శిబిరాన్ని సందర్శించి వీఆర్ఎలకు సంఘీభావం తెలిపారు. అలాగే నిరసన శిబిరం ఖర్చుల నిమిత్తం రూ.3 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గ్రామాల్లో వీఆర్ఎలు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీఆర్ఎల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మండల వీఆర్ఎల సంఘం అధ్యక్షులు తాతపూడి ఇస్సాక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పే స్కేల్ను వీఆర్ఎలకు కూడా అమలు చేయాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన వీఆర్ఏల కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఎల సంఘం సెక్రటరీ కె. శివరామారావు, ఉపాధ్యక్షులు భువనగిరి ఏసు, సలహాదారు నాగేశ్వరరావు, ట్రెజరర్ కుందేటి శ్రీను, సభ్యులు యార్లగడ్డ జీవరత్నం, ఏడిది వెంకటాద్రి, బూరిగ మంగాలక్ష్మి, చోడవరపు రామలక్ష్మి, కోట లక్ష్మి, షేక్ బషీర్ బీబీ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 8న భవన నిర్మాణ కార్మికులు ఛలో
# రామచంద్రపురం జయప్రదం చేయాలి.

**-పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నిట్ల శ్రీను**




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 06:** భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పూర్తిస్థాయి పథకాలు అమలు చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్, సిఐటియు కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 8న చలో రామచంద్రపురం కార్మిక శాఖ మంత్రి ఇంటి వద్ద భవన కార్మికుల రాయబార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంగళవారం ధర్మవరం గ్రామంలో నంది సెంటర్ వద్ద పోస్టర్ విడుదల చేసారు. ఈ పోస్టర్ విడుదల అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్ల శ్రీను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన కార్మికులకు అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి కొన్ని పథకాలనే అమలు చేయడం అన్యాయం అన్నారు. గత ఏడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న క్లైములు పరిహారాలు విడుదల చేయాలని, ప్రమాద బీమా 10 లక్షల రూపాయలు ప్రతీ కార్మికుడికి ఇవ్వాలని, కార్డులు రెన్యువల్స్, రిజిస్ట్రేషన్ ఆఫ్ లైన్ లో కూడా చేయాలని, రెన్యువల్ చేసి అన్ని క్లెయిములు తీసుకోవాలని తదితర డిమాండ్లతో భవన కార్మికులు చేపట్టే ఛలో రామచంద్రపురం కార్యక్రమానికి భవన కార్మికులు అంతా తరలిరావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయి రమణ, తమ్మనబోయిన రాజా, భూదిన సత్తిబాబు, గోనగాని వీరబాబు, ఈగల బాబ్జి, బోల్లువీరబాబు, ముత్యాల చెల్లారావు, జువ్వల చక్రరావు, నానిపల్లి మణికంఠ, వాసం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# కోలాహలంగా పెదపళ్ళ ఊర చెరువుకి నీరు విడుదల కార్యక్రమం

### కాలువ తవ్వకం పనులతో నాలుగు దశాబ్దాల సమస్య పరిష్కారమైందన్న కూటమి నేతలు
### కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గారికి కృతజ్ఞతలు తెలియజేసిన నాయకులు, గ్రామస్తులు



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 06:** పెదపళ్ళ ఊరి చెరువుకి జొన్నాడ - వెదురుమూడి ప్రధాన పంట కాలువ నుంచి చింతలూరు సెంటర్ వద్ద మొదలుపెట్టి, పెదపళ్ళ మెయిన్ రోడ్ పక్కగా బోదె తవ్వకం పనులు పూర్తిచేసి మంగళవారం నీటిని విడుదల చేశారు. కూటమి నాయకులు, గ్రామస్తులు కోలాహలం మధ్య ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా సాగింది. నాలుగు దశాబ్దాలుగా పెదపళ్ళ ఊరి చెరువును పట్టి పీడిస్తున్న సమస్యను కూటమి ప్రభుత్వం సహకారంతో పరిష్కరించడం జరిగిందని, పెదపళ్ళ కూటమి నాయకులు, ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ పనుల వల్ల భూగర్భ జలాలు స్థిరీకరణ జరగడంతో పాటు, మత్స్యకారులకు ఆదాయం లభిస్తుందని, గ్రామపంచాయతీకి ఆదాయం లభిస్తుందని వారు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా వాడపల్లి దేవస్థానం పాలకమండలి సభ్యులు సలాది నాగేశ్వరరావు మాట్లాడుతూ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషితో నాలుగు దశాబ్దాలుగా ఊరి చెరువుకు వచ్చే పూడుకుపోయిన పంటకాలువను బాగు చేసి చెరువుకి నీరు అందించడం జరిగిందని తెలియజేశారు. గతంలో ఎమ్మెల్యే సత్యానందరావు కృషితో పెదపళ్ళ గ్రామంలో పీహెచ్సీ నిర్మాణంతోపాటు, ప్రధాన రహదారి అభివృద్ధి జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రహదారులు, డ్రైనేజీల నిర్మాణం పోలేరమ్మ ఆలయం వద్ద స్థలం అభివృద్ధి, సచివాలయ నిర్మాణం పూర్తి వంటి అనేక కార్యక్రమాలు జరిగాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామంలో పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు కూటమి అభ్యర్థులను గెలిపించి ఎమ్మెల్యే సత్యానంద రావు గారికి కానుకగా అందిస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ యూనిట్ 50 కన్వీనర్ గొడవర్తి రాంబాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఊర చెరువుకి నీరు లేని సమస్య ఉందని, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాలు, సహకారంతో గ్రామ కూటమి నాయకులు, పెద్దలు అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఊర చెరువు నీరు సమస్య పరిష్కారం చేయడం జరిగిందన్నారు. ఊరి చెరువుకు నీరు వదలడం ద్వారా చెరువును అభివృద్ధి చేసుకోవడం, ఈ చెరువు వల్ల గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చుకునేలాగా ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రభుత్వ అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ఏఐ ఆధారిత వైర్‌లెస్ కమ్యూనికేషన్‌పై సర్టిఫికేషన్ కోర్సు

- 5జీ, 6జీ సాంకేతికతలపై నిపుణుల అవగాహన




**గండేపల్లి,పెన్ పవర్, అక్టోబర్ 06:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, ఈసీఈ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో “కాగ్నిటివ్ మరియు ఏఐ ఆధారిత వైర్‌లెస్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్” అనే అంశంపై ఐదు రోజుల ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు ప్రారంభమైంది. ఈ కోర్సులో 5జీ, 6జీ వైర్‌లెస్ కమ్యూనికేషన్, ఓఎఫ్‌డీఎం, జీఎఫ్‌డీఎం, నోమా, మాసివ్ మిమో, ఏఐ ఆధారిత సిగ్నల్ ప్రాసెసింగ్, పీఏపీఆర్ ఆప్టిమైజేషన్, స్మార్ట్ వర్టికల్ హ్యాండోవర్, ఏఐ-ఎన్‌హాన్స్‌డ్ జీఎన్ఎస్ఎస్ తదితర ఆధునిక సాంకేతిక అంశాలపై నిపుణులు అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో-వైస్ ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఆధునిక వైర్‌లెస్ కమ్యూనికేషన్ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు, పరిశోధకులు, నిపుణులకు అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డా. ఎం.బి. శ్రీనివాస్, ప్రో-వైస్ ఛాన్సలర్లు డా. ఎస్. రమాశ్రీ, డా. ఎ. రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ఏఎల్ఏ కోఆర్డినేటర్ డా. ఐ. వీరాంజనేయులు, విభాగాధిపతి డా. సి.హెచ్. జానకి దేవి, రిసోర్స్ పర్సన్స్ డా. ఆర్. అనిల్ కుమార్, డా. కె. నారాయణ స్వామి, డా. పాదర్తి విజయ్ కుమార్, డా. ఎ. లక్ష్మీ నారాయణ, డా. సి.హెచ్. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో జనరేటివ్ ఏఐ, ఏఐ ఏజెంట్స్‌పై వర్క్‌షాప్



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 06:** ఆదిత్య యూనివర్సిటీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏ ఐ అండ్ ఎంఎల్) విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్‌షాప్‌ను ఘనంగా ప్రారంభించారు . ఈ వర్క్‌షాప్‌లో ఏఐ అండ్ ఎంఎల్ విభాగానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌కు ప్రముఖ పరిశ్రమ నిపుణులు డాక్టర్ వెంకీ నాయుడు బాలినేని, హైదరాబాద్ మరియు అవాన్టేజ్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సి.ఈ.ఓ.మురళీ కృష్ణ ఎం., రిసోర్స్ పర్సన్‌లుగా హాజరై విద్యార్థులకు జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రేట్రై వాల్ ఆగ్మెంటెడ్ జనరేషన్ ఏ.ఐ.ఎ జెంట్స్ తదితర ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్‌లు మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో జనరేటివ్ ఏఐ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఆధునిక ఏఐ సాంకేతికతలను కేవలం సిద్ధాంతపరంగా కాకుండా ప్రాక్టికల్‌గా నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జనరేషన్ ఏ.ఐ. సహాయంతో తెలివైన అప్లికేషన్లను అభివృద్ధి చేయడం,రేట్రైవాల్ ఆగ్మెంటెడ్ జనరేషన్ ద్వారా వివిధ డేటా వనరుల నుంచి సంబంధిత సమాచారాన్ని సేకరించి ఏ ఐ అప్లికేషన్ సామర్థ్యాన్ని పెంచడం, ద్వారాఏ.ఐ.ఎ జెంట్స్ స్వయంచాలకంగా నిర్ణయాలు తీసుకునే మరియు నిర్దిష్ట పనులు నిర్వహించే ఇంటెలిజెంట్ అప్లికేషన్లను రూపొందించే విధానం విద్యార్థులకు వివరించారు.

## పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం పెన్ పవర్ అక్టోబర్ 6:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. రావులపాలెంలోని వైసీపీ క్యాంపు కార్యాలయం వద్ద కొమరాజులంక గ్రామ మాజీ సర్పంచ్ కర్రీ వెంకట గోవింద కృష్ణారెడ్డి అధ్యక్షతన గ్రామ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను అందజేశారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరూ కేవలం సభ్యులుగా పరిమితం కాకుండా ప్రజల్లో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని జగ్గిరెడ్డి సూచించారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి తరఫున గళం వినిపించాలన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కొమరాజులంక గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

# సిమెంట్ పరిశ్రమలో సుస్థిరతపై గెస్ట్ లెక్చర్





- భవిష్యత్ తరాలకు పర్యావరణహిత నిర్మాణాలపై అవగాహన

**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 06:** స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం “సస్టైనబిలిటీ త్రూ సిమెంట్ ఇండస్ట్రీ” అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. బీటెక్ ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా సిమెంట్ పరిశ్రమలో సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక నిర్మాణ విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి వక్తగా జువారీ సిమెంట్ ఏపీ, తెలంగాణ డిప్యూటీ మేనేజర్ ఉప్పలపాటి మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పరిశ్రమల్లో వస్తున్న నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు వారి విద్యా, వృత్తిపరమైన పురోగతికి దోహదపడుతుందని అన్నారు.

రిసోర్స్ పర్సన్ ఉప్పలపాటి మురళీకృష్ణ సస్టైనబుల్ సిమెంట్‌పై విద్యార్థులకు వివరించారు. పర్యావరణానికి హాని కలగకుండా, భవిష్యత్ తరాలకు ఇబ్బందులు తలెత్తకుండా భవనాలు, మౌలిక సదుపాయాల నిర్మాణంలో సుస్థిర విధానాలను ఎలా అమలు చేయవచ్చో వివరించారు. సస్టైనబుల్ సిమెంట్ తయారీ విధానం, దాని ఉపయోగాలు, నిర్మాణ రంగంలో దాని ప్రాధాన్యతతో పాటు భవిష్యత్ ఉద్యోగ, ప్లేస్‌మెంట్ అవకాశాల్లో ఈ పరిజ్ఞానం ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి. సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇలాంటి నిపుణుల ఉపన్యాసాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి రావడంతో పాటు కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి, తపన పెరుగుతాయని అన్నారు. కార్యక్రమానికి హాజరైన రిసోర్స్ పర్సన్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్-మేనేజ్‌మెంట్ ఎం.వి. హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం. సతీష్, డైరెక్టర్-అకడమిక్స్ డాక్టర్ కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## మాడవీధుల అభివృద్ధి ప్రతిపాదనపై అభ్యంతరాలు

అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలు నమోదు చేసిన 4-మాన్ కమిటీ





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 6** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థాన మాడవీధుల అభివృద్ధి, భూసేకరణకు సంబంధించి ప్రతిపాదిత కార్యాచరణపై గ్రామస్తుల్లో నెలకొన్న సందిగ్ధత సమావేశం వేదికగా వెలుగులోకి వచ్చింది. మాడవీధుల్లో నివసిస్తున్న గృహ యజమానులు కమిటీ ప్రతిపాదన తమకు ఆమోదయోగ్యంగా లేదని స్పష్టం చేయడంతో అధికారులు వారి అభిప్రాయాలను నమోదు చేశారు. మాడవీధుల అభివృద్ధి దేవస్థాన అవసరాలకు అనుగుణంగా ఉన్నప్పటికీ, స్థానికుల ఇళ్లు, స్థలాలకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగాలన్న అభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆర్‌డీఓ జి.వి.వి. సత్యనారాయణ అధ్యక్షతన 4-మాన్ కమిటీ సమావేశం నిర్వహించింది. సమావేశంలో మాడవీధుల గృహ యజమానులు తమ అభ్యంతరాలను, సూచనలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయం తీసుకోవద్దన్న వాదనలు వినిపించినట్లు సమాచారం. సమావేశంలో వ్యక్తమైన ప్రతి అంశాన్ని నమోదు చేసి, గ్రామస్తుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలతో కూడిన సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. తదుపరి నిర్ణయం ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం వెలువడే అవకాశం ఉంది. సమావేశంలో దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ వి. త్రినాథరావు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ, తహసీల్దార్ ఆర్.డి.శ్రీరామచంద్రమూర్తితో పాటు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ శాఖల అధికారులు, దేవాదాయ శాఖ సిబ్బంది, గ్రామస్తులు, మాడవీధుల గృహ యజమానులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఉత్సవంలో పోషకాహారంపై అవగాహన



**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 6:** కాకినాడ 12వ వార్డులో మంగళవారం సీడీపీవో జ్యోతి ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవ్, పోషణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులతో పోషకాహారం ప్రాధాన్యత, రోజువారీ ఆహారంలో ప్రోటీన్ల అవసరంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, రాష్ట్ర కార్యదర్శి తుమ్మల సునీత, 12వ వార్డు ఇన్‌చార్జ్ తుమ్మల రమేష్, ఏఎంసీ డైరెక్టర్, బీజేపీ నాయకుడు కొండేటి గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించారు.

## వాడపల్లి వెంకన్నకు భక్తుల కానుకలు





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 6:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి మంగళవారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకున్న భక్తులు అనంతరం ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరానికి చెందిన లక్ష్మీ పెద్దింటి రంగాచార్యులు కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,116 విరాళాన్ని సమర్పించారు. కొత్తపేటకు చెందిన బండారు నాగేశ్వరరావు ఆలయానికి 460 గ్రాముల వెండి పళ్లెం, సుమారు రూ.1 లక్ష విలువైన కానుకను సమర్పించారు. దాతలను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు స్వామివారి చిత్రపటాలను బహూకరించారు.

## పల్లె పండుగ 3.0తో గ్రామాలకు మహర్దశ



**రామచంద్రపురం రూరల్, పెన్ పవర్ అక్టోబర్ 6:** పల్లె పండుగ 3.0తో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడి గ్రామాలకు మహర్దశ రానుందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అన్నారు. ద్రాక్షారామం మార్కెట్‌లో రూ.79 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మార్కెట్ షెడ్ (విలేజ్ హాట్) నిర్మాణ పనులకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, డీఎల్‌డీవో వి. అబ్రహం లింకన్, ఎంపీడీవో పద్మజ్యోతి తదితరులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. రామచంద్రపురం మండలానికి రూ.2.55 కోట్లు, కే.గంగవరం మండలానికి రూ.1.37 కోట్లు కలిపి మొత్తం రూ.3.92 కోట్ల నిధులు పల్లె పండుగ 3.0లో మంజూరైనట్లు తెలిపారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో ద్రాక్షారామం మార్కెట్‌ను ఆధునిక మార్కెట్‌గా అభివృద్ధి చేస్తున్నామని, అగ్నిప్రమాదం అనంతరం వ్యాపారులకు అండగా నిలిచి 122 షాపుల నిర్మాణానికి కృషి చేశారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తూర్పు--పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు





- ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సహకరించాలి
- ఈఆర్వో, కాకినాడ డీఆర్వో డా. డి. తిప్పేనాయక్

**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 06:** తూర్పు--పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి నూతన ఓటర్ల జాబితా రూపకల్పనకు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తమ సహకారం అందించాలని ఉపాధ్యాయ నియోజకవర్గ ఈఆర్వో, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి డా. డి. తిప్పేనాయక్ కోరారు.మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో తూర్పు--పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి నూతన ఓటర్ల జాబితా రూపకల్పనపై వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో డీఆర్వో సమావేశం నిర్వహించారు.జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, డీఐఈవో జె. రాంబాబు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. త్వరలో ఖాళీ కానున్న తూర్పు--పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానానికి ఎన్నిక నిర్వహించేందుకు అవసరమైన ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించనున్నట్లు తెలిపారు.ఈ ప్రక్రియకు సంబంధించి గత నెలలో నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు ఓటరుగా తన పేరును నమోదు చేసుకోవాలని సూచించారు.ఓటరు నమోదుకు 2026 నవంబర్ 06వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. 2026 నవంబర్ 25న డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వివరించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాలను నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు.అందిన అభ్యంతరాలను డిసెంబర్ 25వ తేదీ నాటికి పరిష్కరించి, 2026 డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు ఈఆర్వో వెల్లడించారు.ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం--19 అన్ని ఎంపీడీవో,తహసీల్దార్,మున్సిపల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ ప్రక్రియకు సంబంధించి అధికారులకు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు డీఆర్వో వెల్లడించారు. ఓటరు జాబితా రూపకల్పన ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు ఆయా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తమ సహకారాన్ని అందించాలని కోరారు.ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం. జగన్నాథం, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలను వేగవంతం చేసి పేద వర్గాల సొంతింటి కలను సాకారం చేయాలి

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 06:** వివిధ ప్రభుత్వ పథకాల కింద మంజూరైన గృహ నిర్మాణాలను వేగవంతం చేసి, లబ్ధిదారుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంఏవై--1.0, పీఎంఏవై--2.0 అర్బన్, పీఎంఏవై--గ్రామీణ్,టిడ్కో తదితర పథకాల కింద మంజూరైన గృహ నిర్మాణాల పురోగతి,లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన,లబ్ధిదారులకు అవసరమైన సహకారం తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి లేఅవుట్ వారీగా గృహ నిర్మాణాల పురోగతి,లబ్ధిదారుల వివరాలు,అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు,ఇంకా కల్పించాల్సిన సౌకర్యాలపై సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరలో రెవెన్యూ శాఖ అధికారులు, గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. తద్వారా గృహ స్థలాల సేకరణ, అందుబాటు తదితర అంశాలపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు.అంతర్గత రహదారులు,అప్రోచ్ రోడ్లు,స్టోన్ ప్లాంటేషన్ తదితర పనులు పూర్తయిన లేఅవుట్లలో తాగునీరు,విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించి,గృహ నిర్మాణాలు ప్రారంభించేలా లబ్ధిదారులను అన్ని విధాలా ప్రోత్సహించాలని సూచించారు. గృహ స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కొత్తగా గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను ముందుగానే కల్పించాలని సూచించారు.అదేవిధంగా గృహ నిర్మాణాలకు అవసరమైన నిర్మాణ సామగ్రి సరఫరా,నిర్మాణాల పురోగతి తదితర అంశాల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి లబ్ధిదారుడి గృహ నిర్మాణం నిర్దేశిత దశలకు చేరుకునేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని,నిర్మాణాల్లో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి గృహాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ,మంజూరైన ప్రతి గృహాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.గాయత్రిరామ్, ఈఈలు కె.ఎస్.ఎం.రెడ్డి, కె.వి.ఎస్.ఎన్.గుప్తా,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి.

-మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ తోట నరసింహం.





**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 06:** స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైసీపీ నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోట నరసింహం పిలుపునిచ్చారు. మంగళవారం కిర్లంపూడి మండలం సింహాద్రిపురం, భూపాలపట్నం గ్రామాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాలలో పదవులు పొందిన వైసీపీ నాయకులకు ఐడి కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి తోట నరసింహం తోపాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీ రాంజీ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికార దాహంతో ఎన్నికల ముందు ఎన్నో అమలుకాని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలు అడుగుతున్న వైసీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి భయాందోళన గురిచేస్తుందని తోట నరసింహం ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని దుయ్యబట్టారు.కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ అంకుటిత దీక్షతో పనిచేయాలని వైసీపీ నాయకులకు,కార్యకర్తలకు తోట నరసింహం పిలుపునిచ్చారు.ఈ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని,భవిష్యత్తులో వై ఎస్ జగన్మోహన్ రెడ్డిని ఈ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉందన్నారు. పార్టీలో ఐడీ కార్డులు పొందిన నాయకులకు కార్యకర్తలకు భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో సింహాద్రిపురం వైసిపి నాయకులు నంది వెంకన్న, కాలపురెడ్డి కాశీవిశ్వనాధం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా కార్యదర్శి బేరి బాబ్జి, జగ్గంపేట నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షులు ఆరుబోలు వాసు, భూపాలపట్నం గ్రామ కమిటీ అధ్యక్షులు తిబిరిశెట్టి రామకృష్ణ,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కరుటూరి వీర్రాజు,పాఠంశెట్టి కృష్ణమూర్తి,పలికెల గంగరాజు,పాముల చంటిబాబు, వీరబాబు, అడబాల సుబ్బారాయుడు,ఆడారి రాజబాబు,ఓలేటి రాజు, గరగా పెదకాపు,ఆశపు బద్రి అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యాత్మక ప్రాంతాల్లో ఎంపీడీవో క్షేత్రస్థాయి పరిశీలన



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 06:** వివిధ గ్రామాల్లో సమస్యాత్మక ప్రాంతాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎంపీడీవో ఏ. రాజు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని నర్సిపూడి, చొప్పెల్ల గ్రామాల్లో కూటమి నాయకులతో కలిసి ఆయా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. నర్సిపూడిలో భారీగా పేరుకుపోయిన చెత్తను పరిశీలించిన ఎంపీడీవో.. డంపింగ్ యార్డును స్థిరీకరించి, జేసీబీ సహాయంతో చెత్తను తరలించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పెండింగ్లో ఉన్న సబ్‌స్టేషన్ నిర్మాణానికి అధికారుల అనుమతితో స్థలం కేటాయించనున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. అనంతరం చొప్పెల్లలో రహదారి పక్కన దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్త, ఇతర సమస్యలను పరిశీలించారు. సీసీ రోడ్డుతో పాటు డ్రెయిన్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో రాజు తెలిపారు.చొప్పెల్లలోని ఎస్ఈబ్ల్యూపీసీ షెడ్ పనితీరును కూడా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు దునే స్వామినాయుడు, ఉండమట్ల బాలాజీ,సూరపురెడ్డి సత్య, నాగిరెడ్డి మహేష్, కార్యదర్శి పి.రాజుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాలి కాదు.. సహకారం, సమాన అవకాశాలు కావాలి- డా. అడ్డాల



కాకినాడ రూరల్, పెన్ పవర్ అక్టోబర్ 6: సెరెబ్రల్ పాల్సీ ఉన్నవారిపై జాలి చూపడం కంటే వారికి సమాజంలో సహకారం, సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని డా. అడ్డాల అన్నారు. ప్రపంచ సెరెబ్రల్ పాల్సీ దినోత్సవం సందర్భంగా స్థానిక రమణయ్యపేటలోని న్యూరో ఆసుపత్రిలో డా. బెజవాడ కామరాజు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డా. అడ్డాల మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 6న ప్రపంచ సెరెబ్రల్ పాల్సీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెరెబ్రల్ పాల్సీతో జీవిస్తున్న వ్యక్తులు,పిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లపై సమాజంలో అవగాహన పెంచడం,వారి హక్కులు, సమాన అవకాశాల కోసం మద్దతు కల్పించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.న్యూరో ఫిజీషియన్ డా. బెజవాడ కామరాజు మాట్లాడుతూ చిన్నతనంలో,ముఖ్యంగా శిశువు మెదడు అభివృద్ధి చెందుతున్న సమయంలో మెదడుకు గాయం కావడం లేదా మెదడు సరిగ్గా అభివృద్ధి చెందకపోవడం వల్ల సెరెబ్రల్ పాల్సీ ఏర్పడుతుందని వివరించారు.దీనివల్ల శరీర కదలికలపై నియంత్రణ తగ్గడం,కండరాల బలహీనత, నడవడంలో ఇబ్బందులు వంటి సమస్యలు ఎదురవుతాయని తెలిపారు.సెరెబ్రల్ పాల్సీ అంటువ్యాధి కాదని, దీనిపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులకు విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల్లో సమాన అవకాశాలు, ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రపంచ సెరెబ్రల్ పాల్సీ దినోత్సవానికి చిహ్నంగా ఆకుపచ్చ రంగును ఉపయోగిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్,నిమ్మకాయల వెంకటేశ్వరరావుతో పాటు పలువురు ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్‌విఎస్ విద్యాసంస్థల్లో మెగా జాబ్‌మేళా.

- 87 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు
- విద్యా సంస్థల కరెస్పాండెంట్ శ్వేత రమణ




**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్ 06:** కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ఎస్‌విఎస్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో వికాస ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన 12 కంపెనీల ప్రతినిధులు హాజరై సుమారు 200 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. విద్యార్హతలు, నైపుణ్యాలు, సామర్థ్యాలను పరిశీలించి ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా 87 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ శ్వేత రమణ తెలిపారు. చదువుతోపాటు విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇటువంటి జాబ్‌మేళాలు దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ఒకే వేదికపై పలు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను తెలుసుకునే అవకాశం కల్పించడంతో జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ ఎస్ రామకృష్ణ, వికాస అసిస్టెంట్ మేనేజర్ ఎన్ పవన్, నరాలశెట్టి సూర్య పర్యవేక్షించారు. వికాస ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి. రమేష్, వర్మ, రోహిత్ తదితరులు ఇంటర్వ్యూల నిర్వహణలో సహకరించారు. ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యాసంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం.

-27 మందికి రూ.14.24 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ



**-ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్, 06:** అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 27 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.14,24,274 విలువైన చెక్కులను ఆమె పంపిణీ చేశారు. తీవ్రమైన అనారోగ్యంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఊరట కల్పిస్తోందని సత్యప్రభ పేర్కొన్నారు. ఆపదలో ఉన్న అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు సీఎం సహాయనిధి అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. లబ్ధిదారులకు సకాలంలో సహాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్, ఏలేశ్వరం మండల టీడీపీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు,మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు, యిటంశెట్టి భాస్కరబాబు, అన్నవరం టీడీపీ నాయకులు బొమ్మిడి సత్తిబాబు, మెరపల నర్సయ్య, రాజాల చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీలు సాదనాల లక్ష్మిబాబు, కంచిబోయిన శ్రీను, చింతలూరు టీడీపీ నాయకులు పోలినాటి భగవాన్, తూము కొండబాబు, పోలిశెట్టి శ్రీనివాస్, మదినే దొరబాబు, కోలా ధనబాబు, తటవర్తి సుబ్బారావు, జిగటాపు సూరిబాబు, కొప్పుల బాబ్జి, బుర్రా వాసు, కేలంగి జన, కొయ్యా రమణ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కోసం సేవలకు గుర్తింపుగా ఆకుల రామకృష్ణకు జెడ్పీ చైర్మన్ పదవి ఇవ్వాలి

**అంబేద్కర్ కోనసీమ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా ఆకుల రామకృష్ణకు అవకాశం కల్పించాలి**



**రావులపాలెం పెన్ పవర్ అక్టోబర్ 6:** తెలుగుదేశం పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న సీనియర్ నాయకులు ఆకుల రామకృష్ణకు అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కల్పించాలని టీడీపీ శ్రేణులు, అభిమానులు కోరుతున్నారు. పార్టీ కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలిచి, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, రైతులు, ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తున్న నాయకుడిగా ఆకుల రామకృష్ణకు మంచి గుర్తింపు ఉందని వారు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ ఆయన అందిస్తున్న సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించాలని కోరారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంటుందని, రాజకీయ అనుభవం, ప్రజలతో సత్సంబంధాలు, పార్టీ పట్ల విధేయత కలిగిన ఆకుల రామకృష్ణకు ఈ బాధ్యత అప్పగిస్తే జిల్లాలో టీడీపీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. పార్టీ కోసం చేసిన సేవలకు గుర్తింపుగా, సీనియర్ నాయకుడి అనుభవానికి గౌరవంగా, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశంగా ఆకుల రామకృష్ణ పేరును పార్టీ అధిష్ఠానం సానుకూలంగా పరిశీలించి జెడ్పీ చైర్మన్ పదవి కల్పించాలని టీడీపీ యువ నాయకుడు మట్ట బాలు కోరారు.

## మహిళలు, బాలికల భద్రతపై కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కాకినాడ జిల్లా పోలీస్






**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 6:** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఆదేశాల మేరకు కాకినాడ వెంకటనగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మహిళలు, బాలికల భద్రత, బాల్య వివాహాల నిర్మూలన, ఆన్‌లైన్ మోసాలు, విద్య ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై బి. ఏలీయా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, బాలికల భద్రత పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విద్యార్థులకు సూచించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించకుండా, విద్యపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112, సైబర్ నేరాలకు సంబంధించి 1930, బాలల సహాయం కోసం 1098, మహిళల సహాయం కోసం 181 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి సున్నితమైన సమాచారాన్ని వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో అనవసరంగా షేర్ చేయవద్దని, వాటి దుర్వినియోగం వల్ల తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని విద్యార్థులను హెచ్చరించారు. మహిళలు, బాలికలు స్వీయ రక్షణ నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ను వినియోగిస్తే స్థానిక పోలీసుల నుంచి తక్షణ సహాయం పొందవచ్చని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు, నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ





**పాఠశాల విద్య, సమగ్ర శిక్ష అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 06:** జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు పాఠశాల విద్య, సమగ్ర శిక్షకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల విద్య, సమగ్ర శిక్ష, విద్యార్థుల హాజరు శాతం పెంపు, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులతో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణతో బోధనా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బడి బయట పిల్లలు ఎవరూ లేకుండా సమగ్ర సర్వే నిర్వహించి, అర్హులైన ప్రతి బాలబాలికను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ఉన్న లోటుపాట్లను గుర్తించి, ప్రాధాన్యతా క్రమంలో వాటిని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల నిర్వహణను పకడ్బందీగా చేపట్టి, విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. విద్యా రంగానికి సంబంధించిన వివిధ అంశాల్లో ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రుల సంతృప్తి స్థాయిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పీఎం జన్మన్ కార్యక్రమంలో భాగంగా ఆర్టిజన్ కేంద్రాల నిర్వహణ, శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల గుర్తింపు, వాటి తొలగింపు ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. అక్షరాంధ్ర కార్యక్రమం పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థులకు ఆధునిక, అనుభవాధారిత విద్య అందించేలా ప్రయోగశాలలను అభివృద్ధి చేయాలని తెలిపారు. పాఠశాల అవసరాలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్, స్టెమ్ తదితర ల్యాబ్‌లకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ల్యాబ్‌ల నిర్మాణం లేదా అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రయోగశాలలను విద్యార్థుల ప్రయోగాత్మక అభ్యసనానికి సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పీఎం శ్రీ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా అభివృద్ధి చేయడంతో పాటు, నాణ్యమైన విద్యను అందించడం, విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా యువతకు వివిధ కంపెనీల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి, ఆయా కంపెనీల సమన్వయంతో వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమం పురోగతిని కూడా సమీక్షిస్తూ, అర్హులైన యువతకు ఈ అవకాశాలు అందేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్య, సమగ్ర శిక్షకు సంబంధించిన ప్రతి అంశంపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత కాలవ్యవధిలో సాధించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రమేష్, సమగ్ర శిక్ష ఏపీసీ వి.వి.వి. సత్యనారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జ్యోతుల రాంబాబు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఎస్. గోపికృష్ణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ముంగిట్లోనే మెరుగైన వైద్య సేవలు





- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్
- ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో నూతనంగా నిర్మించిన నాలుగు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్
- గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ప్రారంభం

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 06:** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్--గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా వారి ముంగిట్లోనే నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. గ్రామీణ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్--గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను (విలేజ్ హెల్త్ క్లినిక్స్) రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం కృష్ణా జిల్లా నుంచి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వర్చువల్ విధానంలో హాజరయ్యారు. కాకినాడ జిల్లాలో నిర్మాణ పనులు పూర్తయిన పెద్దాపురం నియోజకవర్గంలోని కట్టమూరు, పవర గ్రామాల్లో, ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెద్దనాపల్లి, పోతులూరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్--గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన శిలాఫలకాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు.

**ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు కూడా జిల్లా కేంద్ర ఆసుపత్రులకు రావాల్సిన అవసరం లేకుండా, వారి ముంగిట్లోనే ఉచిత వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తోందని తెలిపారు. స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామ ఆరోగ్య క్లినిక్‌లను ప్రజలు సంప్రదిస్తే అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్యం అందిస్తారని చెప్పారు. దీనివల్ల ప్రయాణ ఖర్చులు ఆదా కావడంతో పాటు, వైద్యం కోసం వెళ్లే సమయంలో రోజువారీ ఉపాధిని కోల్పోయే పరిస్థితి కూడా తప్పుతుందని పేర్కొన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 259 నూతన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను వర్చువల్‌గా ప్రారంభించినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 410 ఆరోగ్య క్లినిక్‌లు ఉండగా, వాటిలో సుమారు 177 నూతన భవనాల నిర్మాణాన్ని డిసెంబర్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్య కేంద్రాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటారని, సుమారు 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని జిల్లా కలెక్టర్ వివరించారు.

జిల్లాలోని ప్రతి పంచాయతీ ప్రజలు ఈ సదుపాయాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్య సేవలు పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

**గ్రామీణ ప్రజలకు ఎంతో ప్రయోజనం: ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ**

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన సేవలు అందించడంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్--విలేజ్ క్లినిక్స్ ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో ఏర్పాటవుతున్న ఈ క్లినిక్స్ ద్వారా పల్లె ప్రజలు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు కూడా నగరాల్లోని పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని అన్నారు. ఈ గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణీ సేవలు, చిన్నపిల్లల వైద్యం, కుటుంబ నియంత్రణ, నాన్-కమ్యూనికేబుల్ వ్యాధుల నిర్ధారణతో పాటు సుమారు 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. టెలిమెడిసిన్ సేవలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, యోగా సెషన్లు కూడా నిర్వహిస్తున్నందున ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ప్రత్తిపాడు నియోజకవర్గంలో 29 ఆరోగ్య కేంద్రాలు**

ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ.. నూతనంగా మంజూరైన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్--గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు నియోజకవర్గ ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా మారనున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 177 ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు కాగా, ప్రత్తిపాడు నియోజకవర్గానికి 29 కేంద్రాలు మంజూరు కావడం, అందులో రెండు కేంద్రాలను ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు. ఒక్కో ఆరోగ్య కేంద్రానికి రూ.36 లక్షల చొప్పున వెచ్చించి, అత్యుత్తమ మౌలిక వసతులతో నిర్మించినట్లు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులను నివారించేందుకే ఈ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో ప్రతిరోజూ పలు రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు సీజనల్ వ్యాధులు, జ్వరాల పట్ల ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే గ్రామం, తద్వారా సమాజం ఆరోగ్యవంతంగా మారుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.ఎస్. చలమయ్య, డీఐవో డా.కె.వి. సుబ్బరాజు, ఎన్‌హెచ్‌ఎం సీపీఎం డా.జి. లక్ష్మి, ప్రోగ్రాం అధికారులు డా.వి. అరుణ, డా.ఐ.ప్రభాకర్, డా.ఎన్. ప్రశాంతి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఆర్చరీకి ఎంపికైన శీల హైస్కూల్ విద్యార్థి తేజస్

**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 06:** కాజులూరు మండలం శీల గ్రామంలోని జడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి గుంటముక్కల తేజస్ నాగసాయి దుర్గవీర శ్రీరామ్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలు శనివారం పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ ఎంపికల్లో అండర్-19 బాలుర విభాగంలో ప్రతిభ కనబరిచిన తేజస్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఎన్.ఎల్.ఎన్. మూర్తి తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. తేజస్‌కు శిక్షణ అందించిన ఫిజికల్ డైరెక్టర్ టి.ఎన్.వి.ఆర్. మూర్తి కృషిని హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన తేజస్‌ను హెచ్ఎం ఎన్.ఎల్.ఎన్.మూర్తి, ఎస్ఎంసీ చైర్మన్ సఖిలే నాగేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు అభినందించారు. రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లోనూ తేజస్ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.



# బిల్లకుర్రులో ఘనంగా సేవా సంకల్ప అభియాన్






**చిన్నారులకు అన్నప్రాసన.. గర్భిణులకు సీమంతం**

**కొత్తపేట, పెన్ పవర్, అక్టోబర్ 6:** తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణతో పాటు పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు బిళ్లకుర్రులోని సత్తెమ్మ కాలనీ 16వ అంగన్‌వాడీ కేంద్రం, నక్కవారిపేట 17వ అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మాస ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంత కార్యక్రమాలు నిర్వహించి, తల్లులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు.కొత్తపేట మండలం ఐసీడీఎస్ పరిధిలోని వానపల్లి సెక్టార్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది హాజరయ్యారు. గర్భధారణ సమయంలో తల్లి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రసవానికి ముందు చేయించుకోవాల్సిన వైద్య పరీక్షలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారం, తగినంత విశ్రాంతి వంటి అంశాలను సిబ్బంది వివరించారు.చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని, వయసుకు అనుగుణంగా సమతుల ఆహారం అందించడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర సేవలను తల్లులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. పిల్లల పరిశుభ్రత, క్రమం తప్పకుండా టీకాలు వేయించడం, ఎదుగుదలను పర్యవేక్షించడం వంటి అంశాల్లో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.మాస ఉత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది సమక్షంలో చిన్నారులకు అన్నప్రాసన చేయించి, పిల్లలకు పరిశుభ్రమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని వయసుకు తగిన విధంగా అందించాలని సూచించారు. అలాగే గర్భిణులకు సీమంత కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించి, వారి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలు శిశువు ఎదుగుదలపై ప్రభావం చూపుతాయని వివరించారు. తల్లి, శిశువు ఆరోగ్యానికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల సంరక్షణలో తల్లుల పాత్రను గుర్తిస్తూ వారిని సన్మానించారు.సీడీపీఓ గజలక్ష్మి, సూపర్‌వైజర్ హిమశ్రీ ఆదేశాల మేరకు సత్తెమ్మ కాలనీ 16వ కేంద్రం టీచర్ నల్ల శ్యామలకుమారి, ఆయా సుంకర పద్మ, నక్కవారిపేట 17వ కేంద్రం టీచర్ బి.లక్ష్మి సుజాత, ఆయా అప్పారి సూర్యకాంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పెద్దలు కె.త్రిమూర్తిరావు, నల్లం బాల, రుద్ర సురేష్, కురస పద్మరాజు, బిళ్లకుర్తి వెంకటాద్రి, వై. రామాంజనేయులు ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లి, శిశు సంక్షేమానికి అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు సూచించారు.

# ప్రత్తిపాడు ప్రజాశక్తి విలేకరిపై భూమాపియా దాడి హేయమైన చర్య.





- ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు.
- దాడిలో గాయపడ్డ సిగిరెడ్డి రమేష్ కు పరామర్శ

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 06:** డి.పట్టా భూముల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలు, నిర్మాణాలను వెలుగులోకి తెచ్చినందుకు 'ప్రజాశక్తి' విలేకరి సిగిరెడ్డి రమేష్‌పై భూమాఫియా దౌర్జన్యంగా దాడికి పాల్పడింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ప్రత్తిపాడులోని దేవర్ష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు.మంగళవారం వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు ఆసుపత్రికి వెళ్లి రమేష్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, పార్టీ తరఫున పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన విలేకరులపై దాడి చేయడం హేయమైన చర్య అని, దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.?ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుగత శివ బాధితుడిని పరామర్శించి, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై దాడిని తీవ్రంగా ఖండించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని పోలీస్ అధికారులను కోరారు.?బాధితుడిని పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, మొయ్యేటి సూర్య ప్రకాశరావు, బీసీ ఐక్య సంఘర్షణ సమితి అధ్యక్షుడు ఏపూరి శ్రీనివాసరావు, బీజేపీ నేత పైలా సుభాష్ చంద్రబోస్‌తో పాటు పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు, పాత్రికేయులు ఉన్నారు.

# గోకవరం లో వర్మీ కంపోస్ట్ తయారీపై ఎక్స్‌పోజర్ విజిట్





కమిషనర్ ఆదేశాలతో ప్రత్యేక శిక్షణ.

**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 06 :-** పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి సూచనలు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ వారి ప్రత్యేక చొరవతో గోకవరం మండలంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు.

**14 పంచాయతీల సిబ్బంది భాగస్వామ్యం:--**

మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ అభివృద్ధి అధికారులు, ప్రతి పంచాయతీ నుండి ఒక క్లాత్ మిత్ర,స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ సోమ,మంగళవారం గోకవరం షెడ్ వద్ద నిర్వహించిన ఎక్స్‌పోజర్ విజిట్ లో పాల్గొన్నారు. ఈ శిక్షణలో సిబ్బందికి పలు కీలక అంశాలపై ప్రాయోగిక అవగాహన కల్పించారు.వ్యర్థాల నుండి

తడి-పొడి చెత్తను మూలాల్లోనే వేరు చేయడం,ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేయడం,వర్మీ కంపోస్ట్ తయారీ విధానం మరియు దాని వినియోగం -గ్రామ పంచాయతీలలో సమర్థవంతమైన పారిశుధ్య నిర్వహణ సంపద సృష్టి - ప్రధానాంశాలుగా గోకవరం ఎంపీడీవో ఎం గోవిందు అవగాహన కల్పించారు.

**భద్రతా ప్రమాణాలపై దిశానిర్దేశం:**

విధి నిర్వహణ సమయంలో స్వచ్ఛ సిబ్బంది తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, రేడియం/రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించాలని డిప్యూటీ ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి సూచించారు.

**స్వచ్ఛ గ్రామమే లక్ష్యం:**

సేంద్రీయ వ్యర్థాలను వర్మీ కంపోస్ట్ గా మార్చడం ద్వారా గ్రామాలను స్వచ్ఛంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడంతో పాటు రైతులకు మేలైన ఎరువును అందించవచ్చని అధికారులు తెలిపారు. ఈ శిక్షణ గ్రామాల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో గోకవరం పీడీఓ సూరిబాబు మరియు మండల సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన పారిశుధ్యాన్ని అందించాలి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 6:** నగరంలో పారిశుధ్య పనులు నిరంతరం సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య పనులు, ఇంటింటికి చెత్త సేకరణ, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం, తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతిరోజూ క్షేత్రస్థాయి పరిశీలనలు తప్పనిసరి అని, ప్రజల అభిప్రాయాలు ముఖ్యమన్నారు. పారిశుధ్యంపై నిర్వహించే ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఆశించిన రీతిలో మంచి ఫలితాలు సాధించాలంటే.. ప్రజల స్పందనను పెంచడం, క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావడం ముఖ్యమన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సంపూర్ణంగా నిర్వహించాలన్నారు. నగరంలోని వాణిజ్య సంస్థలు, దుకాణాలపై షీ టీమ్స్ దాడులు నిర్వహిస్తూ.. నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకుని, జరిమానాలు విధించాలన్నారు. ఇప్పటివరకు ఎన్ని దుకాణాలపై దాడులు నిర్వహించింది? ఎంత ప్లాస్టిక్ స్వాధీనం చేసుకుంది? ఎంత మొత్తం జరిమానాలు విధించారో అడిగి తెలుసుకున్నారు. ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరగకుండా.. వర్షపు నీరు నిల్వ , దోమలు వ్యాప్తి చెందకుండా ప్లాట్ల యజమానులు శుభ్రం చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సైడ్ డ్రెయిన్లలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని.. ఎక్కడైనా డ్రెయిన్లు ఆక్రమణకు గురైతే ప్లానింగ్ సెక్రటరీల సాయంతో వెంటనే వాటిని తొలగించాలన్నారు. రోడ్ల వెంబడి భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. నైట్ శానిటేషన్ పై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని సూచించారు. రోడ్లపైన పశువులు, పందుల సంచారం ఉండకూడదన్నారు. నగర పారిశుధ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది కృషి చేసి.. మెరుగైన ఫలితాలు తీసుకురావాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి.

- వీరవరంలో కోటి రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.





**కిర్లంపూడి, పెన్ పవర్ అక్టోబర్ 06:** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులు, రాష్ట్ర టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు.కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా రూ. కోటి వ్యయంతో నిర్మించిన ఒక కిలోమీటర్ సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రత్యేక స్టాల్ ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశీలించి పిండి వంటలను రుచి చూశారు.అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పల్లెలు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.పల్లె పండుగ 3.0 ద్వారా ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, త్రాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోట రవి,వీరవరం, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షులు తోట గాంధీ, కుర్ల చినబాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు, టిడిపి నాయకులు చదరం చంటి బాబు, కొత్త కొండబాబు, ఎస్. వి. ఎస్ అప్పలరాజు,మారిశెట్టి భద్రం,పాలచర్ల నాగేంద్ర చౌదరి, గొల్లపల్లి సూరిబాబు, దాసరి సీతారామకృష్ణ, నీలంశ్రీను, అనుకుల శ్రీకాంత్,తూము కుమార్, గుడాల రాంబాబు,కుంచే తాతాజీ, పాఠంశెట్టి రవి,కాళ్ల వెంకటేష్, పంచాయతీరాజ్ డి ఇ ఉమాశంకర్, ఎంపిడిఓ, బాయిశెట్టి హరికృష్ణ,తహసీల్దార్ కె సాయికిరణ్ అధిక సంఖ్యలో కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# వాడపల్లి ఆలయంలో వైభవంగా వరుణ జపాలు

లోకకల్యాణం.. సకాలంలో వర్షాలు.. పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్ష






**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 6** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వరుణ జపాలు, వరుణ సూక్తుల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోకకల్యాణం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్చారణలు మార్మోగాయి. వరుణ దేవుని అనుగ్రహంతో ప్రకృతి అనుకూలించి ప్రజలకు సుఖసంతోషాలు కలగాలని, రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని అర్చకులు సంకల్పంతో వరుణ జపాలు, వరుణ సూక్తులు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.ప్రజల సంక్షేమం, లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ దేవస్థానాల ఆధ్వర్యంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా వాడపల్లి ఆలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. వర్షాలు సకాలంలో కురిసి రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు, దేవస్థాన సిబ్బంది పాల్గొని వరుణ జపాలు, వరుణ సూక్తుల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# శ్రేయస్ సూపర్ సెంచరీ.. విండీస్‌పై భారత్ ఘన విజయం

- కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 43 బంతుల్లో 102 పరుగులతో అజేయ శతకం
- 172 పరుగుల లక్ష్యాన్ని 14.4 ఓవర్లలోనే ఛేదించిన టీమిండియా
- ఇషాన్ కిషన్‌తో కలిసి అయ్యర్ 137 పరుగుల అజేయ భాగస్వామ్యం
- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన భారత్



వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ విధ్వంసకర సెంచరీతో కదం తొక్కాడు. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై, అయ్యర్ ఆడిన సుడిగాలి ఇన్నింగ్స్ ముందు వెస్టిండీస్ బౌలర్లు తేలిపోయారు. కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచిన అయ్యర్.. టీమిండియాకు అద్భుత విజయాన్ని అందించాడు. అతని బ్యాటింగ్ ధాటికి 172 పరుగుల లక్ష్యం చాలా చిన్నదిగా కనిపించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బ్యాటర్లలో షాయ్ హోప్ (52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (56) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో నమన్ ధిర్ 3 వికెట్లతో సత్తా చాటగా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (21), సంజూ శాంసన్ (11) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 35 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ క్లిష్ట దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. ఆట స్వరూపాన్నే మార్చేశాడు. వచ్చినప్పటి నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అతనికి ఇషాన్ కిషన్ (37 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. ఒకవైపు అయ్యర్ బౌండరీల వర్షం కురిపిస్తుండగా, మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్ సంయమనంతో ఆడి వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు కేవలం 67 బంతుల్లోనే 137 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయ్యర్ తన కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షంగా మార్చేశాడు. ఫలితంగా భారత్ 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఘన విజయం సాధించింది. తమ ఇన్నింగ్స్ లో మరో 20 పరుగులు చేసుంటే బాగుండేదని విండీస్ భావించినప్పటికీ, అయ్యర్ బ్యాటింగ్ తీరు చూశాక మరో 60 పరుగులు చేసినా కరీబియన్లు గెలవలేరని స్పష్టమైంది.ఇక ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఈ నెల 9న రాంచీలో జరగనుంది.

## పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు భారీ షాక్.. సగం ధరకే ప్రసార హక్కుల విక్రయం!



పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. తమ దేశంలో జరిగే 25 అంతర్జాతీయ మ్యాచ్‌ల ప్రసార హక్కులను నిర్ణయించిన ధర కంటే దాదాపు సగం ధరకే విక్రయించాల్సి వచ్చింది. ప్రసార హక్కుల కోసం ప్రభుత్వ టెలివిజన్ సంస్థ 'పాకిస్థాన్ టెలివిజన్ కార్పొరేషన్' (పీటీవీ) మాత్రమే బిడ్ దాఖలు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.పీసీబీ ఇటీవల ప్రసార హక్కుల కోసం టెండర్ జారీ చేసింది. దీనికి రూ.600 మిలియన్లను (పాకిస్థానీ రూపాయలు) రిజర్వ్ ధరగా నిర్ణయించింది. గతంలో మాదిరిగా పలు సంస్థలు కలిసి కన్సార్టియంగా బిడ్ వేసే అవకాశం ఈసారి ఇవ్వలేదు. దీంతో పోటీ తగ్గిపోయింది. చివరకు పీటీవీ రూ.350 మిలియన్లకు బిడ్ వేసి హక్కులను దక్కించుకుంది. అంటే బోర్డు నిర్ణయించిన ధరతో పోలిస్తే దాదాపు రూ.250 మిలియన్లు తక్కువకే హక్కులు విక్రయించాల్సి వచ్చింది.కొత్త ఒప్పందంలో మొత్తం 25 హోమ్ మ్యాచ్‌లు ఉన్నాయి. ఇందులో ఐదు టెస్టులు, 14 వన్డేలు, ఆరు టీ20లు ఉన్నాయి. ఈ నెలలో పాకిస్థాన్.. శ్రీలంకతో మూడు టీ20లు ఆడనుంది. ఆ తర్వాత ఇంగ్లాండ్‌తో కలిసి ఏడు మ్యాచ్‌ల ట్రై సిరీస్ జరగనుంది. వచ్చే నెలలో శ్రీలంకతో రెండు టెస్టులు కూడా ఉన్నాయి.

పాకిస్థాన్ జాతీయ జట్టు ఇటీవలి ప్రదర్శన అంతంతమాత్రంగానే ఉండటం వల్ల స్పాన్సర్లు, ప్రకటనదారులు క్రికెట్‌పై పెద్దగా ఆసక్తి చూపడం లేదని పీసీబీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు గతంలో కన్సార్టియంగా ప్రసార హక్కులు తీసుకున్న కనీసం మూడు సంస్థలు పీసీబీకి ఇంకా బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో ఈసారి బిడ్ వేసేందుకు ఆసక్తి చూపిన సంస్థల సంఖ్య భారీగా తగ్గిపోయింది.బకాయిలు ఉన్న సంస్థలను బిడ్డింగ్ నుంచి పీసీబీ నిషేధించలేదు. అయినా అవి స్వచ్ఛందంగా పోటీకి దూరంగా ఉన్నాయని సమాచారం. గతంలో పాకిస్థాన్ క్రికెట్ ప్రసార హక్కుల్లో ఎక్కువ భాగం దక్కించుకున్న ఓ సంస్థ కూడా ఈసారి ఆసక్తి చూపలేదు.ఇక 2027 జనవరిలో ఐర్లాండ్‌తో మూడు టీ20లతో పాటు ఐర్లాండ్, జింబాబ్వే పాల్గొనే ఏడు మ్యాచ్‌ల ట్రై సిరీస్ కూడా ఈ ప్రసార ఒప్పందంలో ఉంది. అయితే అంతర్గత బోర్డు సమస్యల కారణంగా పాకిస్థాన్ పర్యటనకు జింబాబ్వే వచ్చే పరిస్థితిలో లేదని ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది.

ఇటీవల పాకిస్థాన్ సూపర్ లీగ్ 11వ సీజన్ సమయంలోనూ పీసీబీకి ప్రసార హక్కుల విషయంలో ఆశించిన స్పందన రాలేదు. గత సీజన్ హక్కులు దక్కించుకున్న ఓ ప్రసార సంస్థ ఇప్పటికీ బోర్డుకు బకాయి పడినట్లు సమాచారం. దీంతో పాకిస్థాన్ క్రికెట్ ఆర్థిక పరిస్థితిపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## 'ప్లేయర్స్ కెప్టెన్.. వ్యూహాల్లో చాలా షార్ప్'.. శ్రేయస్‌పై లక్ష్మణ్ ప్రశంసలు



ఆసియా క్రీడల్లో భారత జట్టుకు స్వర్ణం అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై హెడ్ కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసలు కురిపించాడు. శ్రేయస్ ఆటగాళ్ల కెప్టెన్ అని కొనియాడాడు. ప్రతి ఆటగాడిని సౌకర్యంగా ఉంచుతూ, వారి నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టే సామర్థ్యం ఉందని చెప్పాడు. కెప్టెన్‌గా అతడికి మంచి భవిష్యత్ ఉందని ఆశాభావం వ్యక్తం చేశాడు.జట్టు సమావేశాలకు ముందే శ్రేయస్ ప్రత్యర్థి బలాలు, బలహీనతలపై కసరత్తు చేస్తాడని లక్ష్మణ్ తెలిపాడు. ఫిట్‌నెస్‌కు కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తాడని చెప్పాడు. టీ20ల్లో ప్రత్యర్థి కంటే ఒకటి, రెండు అడుగులు ముందుండేలా వ్యూహాలు సిద్ధం చేసుకుంటాడని ప్రశంసించాడు.

జట్టులోని ప్రతి ఆటగాడి సామర్థ్యాన్ని శ్రేయస్ బాగా అర్థం చేసుకున్నాడని లక్ష్మణ్ అన్నాడు. పరిస్థితులకు తగ్గట్టు నిర్ణయాలు తీసుకోవడంలో అతడు చాలా చురుకుగా ఉంటాడని పేర్కొన్నాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్‌లోనూ ముందుండి జట్టును నడిపిస్తాడని చెప్పాడు.

శ్రేయస్ నాయకత్వంలో భారత్ ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. ఫైనల్లో పాకిస్థాన్‌ను 19 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 211/6 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 28 బంతుల్లో 61 పరుగులు చేశాడు. తిలక్ వర్మ 22 బంతుల్లో అజేయంగా 51 పరుగులు సాధించాడు.లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 192/6కే పరిమితమైంది. హసన్ నవాజ్ 51 బంతుల్లో 96 పరుగులతో పోరాడాడు. చివరి బంతికి శివమ్ దూబే అతడిని ఔట్ చేయడంతో భారత్ స్వర్ణం ఖాయం చేసుకుంది.జపాన్‌లో ప్రతికూల వాతావరణం, ప్రయాణ సమస్యలు, సాధనకు తక్కువ సమయం ఉన్నా ఆటగాళ్లు అద్భుతంగా సర్దుకుపోయారని లక్ష్మణ్ చెప్పాడు. కఠిన పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంతో ఆడటం తనను ఆకట్టుకుందని తెలిపాడు. భారత క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవ లేదని పేర్కొన్నాడు.

# వెండితెర ప్రేమికులుగా రియల్ కపుల్స్





నిజజీవిత జంటలు వెండితెరపై అలరించడం ఎప్పుడూ ఒక ప్రత్యేక ఆకర్షణే. నిజ జీవితంలో ప్రేమించుకుని లేదా వివాహం చేసుకుని.. ఆ తర్వాత ఆన్-స్క్రీన్‌లోనూ జంటగా కనిపించి ప్రేక్షకులను అలరించిన జోడీల ట్రెండ్ ఇప్పుడు మరింత ఊపందుకుంటోంది. టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకమైన -రణబాలి- చిత్రంలో జంటగా నటిస్తూ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతున్నారు. అలాగే బాలీవుడ్‌లో కొత్తగా పెళ్లయిన సోనాక్షి సిన్హా- జహీర్ ఇక్బాల్ జంటగా నటిస్తున్న -తు హై మేరి కిరణ్- సినిమా ట్రైలర్ అక్టోబర్ 6న విడుదల కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు స్టార్ కపుల్స్ రణ్‌బీర్ కపూర్ - ఆలియా భట్ కూడా సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం -లవ్ అండ్ వార్- తో వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారు.ఈ కోవలోనే మరికొన్ని రియల్ లైఫ్ జోడీల ఆన్-స్క్రీన్ ప్రయాణం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే -షేర్షా- చిత్రంతో అందరినీ అలరించిన సిద్ధార్థ్ మల్హోత్రా- కియారా అద్వానీ జంట మరో కొత్త సినిమా కోసం సన్నాహాలు చేస్తున్నారనే వార్తలు ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. అలాగే గతంలో -మహాసముద్రం- చిత్రంలో కలిసి నటించిన సిద్ధార్థ్ - అదితి రావ్ హైదరీల జోడీ కూడా రియల్ లైఫ్‌లో ఒక్కటైన తర్వాత మరో కొత్త ప్రాజెక్ట్‌లో కలిసి నటిస్తారనే ఆసక్తి అభిమానుల్లో ఉంది. ఇలా నిజ జీవితంలో జంటగా ఉన్న నటీనటులు వెండితెరపై కూడా తమ కెమిస్ట్రీని రిపీట్ చేస్తుండటం సినిమాపై అదనపు క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది.ఇక టాలీవుడ్ విషయానికి వస్తే.. ఇటీవల వివాహబంధంతో ఒక్కటైన నాగచైతన్య - శోభిత ధూళిపాల జోడీని వెండితెరపై ఎప్పుడెప్పుడు చూస్తామా? అని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ రియల్ లైఫ్ జోడీని ఒకే ఫ్రేమ్‌లో చూడాలంటే ఏ దర్శకుడు సాహసం చేస్తారనే చర్చ టాలీవుడ్‌లో జోరుగా సాగుతోంది. త్వరలో అప్‌కమింగ్ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్న దర్శకుడు చందు మొండేటి లాంటి టాలెంటెడ్ డైరెక్టర్లు వీరిద్దరితో ఎలాంటి కథతో సినిమా తెస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మొత్తానికి రీసెంట్ టైమ్స్‌లో రియల్ జోడీల ఆన్-స్క్రీన్ రొమాన్స్ ప్రేక్షకులకు అంతులేని వినోదాన్ని పంచుతోంది.కాస్త సీనియర్లలో అక్కినేని నాగార్జున, అమల జంట విషయానికి వస్తే.. వీరు పెళ్లికి ముందే పలు చిత్రాల్లో జంటగా నటించి ప్రేక్షకులను ఎంతగానో అలరించారు. -కిరాయి దాదాలు-,-శివ-,-ప్రేమ యుద్ధం-, -అగ్ని పుత్రుడు- వంటి విజయవంతమైన చిత్రాల్లో వీరు కలిసి నటించారు. ఆ తర్వాత పరస్పరం ఇష్టపడి పెద్దల అంగీకారంతో 1992లో వివాహం చేసుకున్నారు. అయితే విశేషం ఏమిటంటే.. పెళ్లి అయిన తర్వాత అమల పూర్తి సమయం నటనకు దూరంగా ఉంటూ కేవలం వ్యక్తిగత జీవితం -జంతు సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. అందువల్ల వీరు పెళ్లి తర్వాత ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు.ఇక పలు చలనచిత్ర పరిశ్రమలలో (బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్) నిజ జీవితంలో ప్రేమించి పెళ్లి చేసుకున్న నటీనటులు ఆన్-స్క్రీన్‌లోనూ జంటగా అలరించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. బాలీవుడ్‌లో రిషి కపూర్ - నీతూ కపూర్, అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్య రాయ్, అజయ్ దేవగణ్ - కాజోల్, అలాగే ఇటీవలి కాలంలో దీపికా పదుకొణె - రణ్‌వీర్ సింగ్ వంటి జంటలు తమ నిజ జీవిత బంధానికి ముందో లేదా ఆ తర్వాతో సినిమాల్లో జంటగా నటించి మెప్పించారు. అలాగే టాలీవుడ్‌లో మహేష్ బాబు - నమ్రత (పెళ్లికి ముందు -వంశీ- చిత్రంలో), కోలీవుడ్‌లో సూర్య - జ్యోతిక (కాకా కాక, చంద్రముఖి తదితర చిత్రాలు), అజిత్ - శాలిని (అమరకలం), మాలీవుడ్‌లో బిజు మీనన్ - సంయుక్త వర్మ వంటి ఎంతోమంది రియల్ కపుల్స్ వెండితెరపై కూడా ప్రేమికులుగా- భార్యాభర్తలుగా నటించి తమ అద్భుతమైన కెమిస్ట్రీతో ప్రేక్షకులను అలరించారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com